



ఏశాడు,

పాపారావు ఒకళ్ళైదీ.

రాతిబండపై కూర్చొని యోచిస్తున్నాడు. మూలనున్న చమురు దీపము ఆరిపోవడానికి ఆయాసపడుతోంది, చుట్టూ కలయ చూసాడు. ఒకసారి తన్ను తాను చూచుకున్నాడు, మలినంతో దుఃఖాశ్రువులు జారాయి,

'పాపి యింకా బ్రతికే వున్నావా?
నీకు రవ్వంత దుఃఖం, బాధ లేదు,
నవ్వొక హంతకుడవు!'

గది నలు మూలలా మోగుతున్నట్లనిపించాయి, గట్టిగా కళ్ళు మూసుకొని, చెవులు మూసుకున్నాడు. గతం కళ్ళముందు విక్పితంగా నాట్యమాడ సాగింది.

* * *

పాపారావుకు ఇరవై సంవత్సరాలు నిండాయి. తండ్రికూడా గతించాడు. అప్పటికి తను ఏకాకి వూళ్ళో వారి ప్రోద్బలంవల్ల తనూ ఒక యింటి వాడనిపించుకున్నాడు. వూళ్ళో వున్న కొద్ది పొలంతో హాయిగా సంతోషంగా కాలం గడుపుతున్నాడు,

తను పొలం పని చూచుకుని 8 గం॥ లకు యింటి కొచ్చాడు తక్కున ఆగి పోయాడు. తన మల్లి అటు తిరిగి,

నాకేసి ఒకసారిచూడు మామ

నిన్ను నమ్ము కున్నాను

నాకన్యాయం చేయమాకు మామ!

అంటూ సన్నగా పాడుతున్నది, యింత కాలం తను తన మల్లికి అన్యాయం చేస్తున్నాడా? ఒకసారి పరిసరాలు పరికించాడు. వెన్నెల తెల్లగా వికసించింది, మల్లెల సువాసన గుభాళించింది. మల్లి కేసి చూచాడు.

"మల్లియింత అందగత్తా!" మనస్సులో అనుకున్నాడు, చడీ చప్పుడు లేకుండా వెళ్ళి కళ్ళుమూశాడు. మల్లి బెదరిపోయింది.

చిన్న గావవ్వి "మల్లి" అన్నాడు.

"బడే వాడివి మామ, జడుసుకున్నాను."

"ఎందుకు?"

"ఎందుకేటి నీకు తెలియదా?"

"నాకా!"

"పో మామా నీదంతా వేళాకోళము."

"మల్లీ! నీకు చాలకష్టముకలిగించాను కదూ." హృదయంలోకి తీసుకుని, ప్రేమలో మల్లి పెదాలు చుంబించాడు.

"మామా! ఏమిటో అనుకున్నా నసుడవే." యింట్లోకి త్రుళ్ళుతు పరుగెత్తింది.

రోజులు గడచిపోతున్నాయి. అందమైన

రచన:

నందం రామారావు

మల్లి రంగడి కంటబడింది. ఆమెను కామించాడానికి వుచ్చులు పన్నసాగాడు. పాపారావు పొలం పనులమీద రాత్రిలు అక్కడేవుంటున్నాడు, పూలరంగడలా రంగడు ముస్తాబై అర్ధరాత్రి తలుపు కొట్టాడు, సంతోషంగా తలుపు తెరచింది మల్లి. ముఖం నల్లబడింది వణకసాగింది. తల్లోని పూలు క్రిందపడ్డాయి.

"మల్లీ! ఎన్నాళ్ళకు అవకాశం." అంటూ ముందుకొచ్చాడు.

మల్లి రెండడుగులు వెనక్కి వేసింది.

"రా మల్లీ అలా వెనక్కి వెడతావే."

"ఫో నీచుడా ముందు యిక్కడనుంచి" అరచింది.

"యింత అందమయిన రాత్రి ఏమిటీ మాటలు?"

"ముందు పోతావా? లేదా?"

మల్లి చెయ్యి పట్టుకున్నాడు. ఆమెను తన యినుప బాహువుల్లోకి తీసుకోబోయాడు, మల్లిలో స్త్రీత్వం మేల్కొంది. "ఛీ దుర్మార్గుడా! యింత కాలంవరకూ నీ మనస్సు మార్చుకుంటావనుకున్నాను. ఆఖరకు యింత సాహసిస్తావా? అని రంగణ్ణి కొరికింది. అతని బాహువుల్లోనుంచి తప్పించుకుంది. అందిన వస్తువల్లా గిరాటు వేసింది. నీచ రంగడు అవమానంతో కోపంతో రెచ్చిపోతూ "మల్లి" అంటూ పళ్ళు పటపటా కొరుకుతూ వెళ్ళిపోయాడు. క్రిందపడ్డ మల్లి తల్లోని పూలు రంగడి కాళ్ళ క్రింద పడి నలిగిపోయాయి. ఆ అబల మల్లి కళ్ళ నుంచి అశ్రువులు కారుతున్నాయి. శూన్యంలోకి చూస్తూ అలాగే పడిపోయింది.

తెల తెల్లవారుతూవుంది. పాపారావు పండుకున్న గడ్డి వాముమీదనుంచి లేచాడు. కాకులు గానం చేస్తున్నాయి. మసక మసకగా వెలుగు నీడలు చెట్ల సందుల్లోంచి జారుతున్నాయి, చందమామ వెలవెలబోతున్నది. పాపారావు యింటి ముందాగాడు. ఆశ్చర్యపోయాడు, తన మల్లి ఎదురుచూడడములేదు! లోపల అడుగు పెట్టాడు. మరింత ఆశ్చర్యపోయాడు. 'తన మల్లి'! తనమల్లేనా?!! అచేతనంగా ఆమె నేలమీద వెల్లకిలలా పడివుంది. ఏమిటీ రోజు? పాపారావు హృదయం గజగజలాడింది. దగ్గరకు వెళ్ళి "మల్లి" అన్నాడు ప్రేమగా.

"————"

"మల్లి." ఆదరంతో చెయ్యి వేశాడు.

మల్లి వులిక్కిపడింది. చూచింది. ఆమె హృదయాంతరాలలో ఎక్కడో ఓ మూల మెరసింది సౌదామిని.

"మామా" అంటూ అతని కౌగిలిలో వాలిపోయింది. కన్నీరు కార్చింది.

"మామా! నువ్వు నా కంటికి రెప్పవు. నాకను పాపవు. నన్ను విడనాడొద్దు." మల్లి అమాయకత్వానికి ఓ చిరునవ్వు నవ్వాడు మామ పాపారావు.

కారుచీకట్లు కమ్మాయి. పాపారావు ఆలోచిస్తున్నాడు. రంగడు ప్రక్కన చేరాడు. మాట్లాడుతున్నారు. మాటల్లో "యిక్కడేమన్నా అంటే, మల్లి మరొకడితో కులుకుతోంది." చెప్పాడు రంగడు. పాపారావు నమ్మలేకపోయాడు. చెమటలు పోశాయి. రంగడు వంక చూచాడు. నమ్మకం పుట్టి పడేలా మరింత అందంగా చెప్పాడు మాటలు నేర్చిన రంగడు. పాపారావు హృదయం బరువెక్కింది, కోప

(తరువాయి 19 వ పేజీ)

# మల్లి

(10 వ పేజీ తరువాయి)

ముతో, అసహ్యంతో, రంగడి హృదయం ఆనందంతో తేలియాడింది. పాపారావు బయలుదేరాడు. రౌద్రాకారంతో, దహించుమేరుతో, 'నిజమా? కాదా?' అనే యోచన అతనికి కలుగలేదు. యింటిదగ్గరకు సమీపించాడు.

ఆ సమయంలోనే పాపారావు స్నేహితుడు పాండు పాపారావు కోసం యింటికి వెళ్ళాడు. తలుపులు వేసి వున్నాయి.

"ఒరేయ్! పాపారావు" అంటూ తలుపు తట్టాడు పాండు.

"ఎవరూ?" అంటూ తలుపు తెరచింది మల్లి.

"నేనే"

"నువ్వాఅన్నయ్యా! ఎవరో అనుకున్నాను."

"ఈ మధ్య ఈడు కనబడడంలేదు. ఎక్కడుంటున్నాడు?"

"పొలం పనులమీద అక్కడేవుంటున్నాడు. లోపలకొచ్చి కూర్చో అన్నయ్యా." అంటూ మంచం వాల్చింది మల్లి.

"కనపడి చాలారోజులయింది. సరే, పొలానికి వెళ్ళి కలుసుకుంటాను. నేను వచ్చానని చెప్పు." అంటూ లేచి బయటకు వచ్చాడు పాండు. లోపలనుంచి పాండు రావడం పాపారావు చూచాడు, యింకేముంది. అతని అనుమానం మరింత దృఢపడింది. కళ్ళు ఎఱ్ఱ చేశాడు. మల్లి ఎదురు చూస్తున్నది బయట నుంచుని, ఆమెను ఆ స్థితిలో చూడగానే అతనిలో రక్తం-ద్వేషంతో, కోపంతో వుప్పొంగింది. పాపారావును చూడగానే మల్లి మోము వికసించింది, ఎదురు వెళ్ళింది.

"ఎవడికోసమే ఎదురుచూస్తున్నావు?" మల్లి హృదయం విలవిల లాడింది.

"ఏంమాట్లాడేవు? .......... నే వచ్చానని బాధగావుందా? లేక గుట్టు రచ్చకెక్కిందనా?"

"ఏంమాటలు మామా!" అయోమయంగా అంది.

"యింకా ఎంతకాలం ఆడుతావు ఈ నాటకం?"

మల్లి వంటిమీద దెబ్బలు పడ్డాయి. భారంగా మూలిగింది, పడిపోయింది.

'మానవ జీవితం అసూయ, ద్వేషం, అవమానాలతో కూడింది జీవితపు హృదయపు మారుమూలల్లో మిణుకు మిణుకు మంటూ వెలిగే సత్యం, నీతి, నిజాయితీ వీటికి సదా సంఘర్షణ జరుగుతూనే వుంటుంది. ఆ సంఘర్షణలో సత్యం, నీతి, నిజాయితి నామరూపాలులేకుండా పోయి, అసూయ, ద్వేషాలదే పై చెయ్యి అయి మానవజీవితాన్ని సర్వనాశనం చేస్తాయి.

* * *

రోజులు విషాదంగా దొర్లిపోతున్నాయి. మల్లి తన మామకు ఎంత చేరువుగా రావాలనుకుంటున్నదో అతను అంత దూరమవుతున్నాడు. మల్లి ముఖంలో విషాద రేఖలు స్పష్టంగా అలుముకున్నాయి. హృదయంలో కళ్ళల్లో నిరాశ, పాపారావులో అసూయ, ద్వేషాలు పడగవిప్పి బుసలుకొడుతున్నాయి. కళ్ళల్లో కోపం తాండవిస్తోంది. ఈ నాడు పాపారావు పక్కా తాగిబోతు, కటిక చీకటి.

తూలుతూ వస్తున్నాడు పాపారావు. బండబూతులు కూస్తున్నాడు. మల్లి చూచింది. "మామా" అంది యింటికొచ్చాడనే సంతోషంతో.

"ఛీ! ఎవతివే నువ్వు."

"నేను మామా. నీ మల్లిని." సంతోషంగా అంది లోపలకు తీసుకువచ్చింది. పాపారావులో కోపం పడగ విప్పింది. మల్లి పళ్ళెంలో భోజనం తీసుకొచ్చింది. నోట్లో ముద్దపెట్టింది ప్రేమతో. "ఛీ" అని ఊసివేశాడు,

"తిను మామా" లాలనగా అంది "పాడుదాన, నన్ను మాయ చేద్దామనుకున్నావా.! అన్నంలో మందుపెట్టి నన్ను చంపి, ఆడితో కులుకుదామనుకున్నావా?"

"... ... ... ..."

"ఏంమాట్లాడవు లంజా, ఎవడే వాడు? చెప్పు, చెబుతావా లేదా? చెప్పవా?? చూసుకో నీతోనే చెప్పిస్తాను." 'మల్లి' వంటిమీద దెబ్బలు పడుతున్నాయి.

"నాకేం తెలియదు మామ."

"తెలియదే?"

"అమ్మోరిమీద ఒట్టు మామ. నాకేమి తెలియదు. నన్నేమి చెయ్యమాకు మామ," మొరపెట్టుకుంది.

"యింకా బిట్టుకూడా నంటే. బాగా పడుతున్నాయి దెబ్బలు, ఆ దెబ్బల్లో మల్లి మాటలు వినబడటంలేదు.

"నువ్విట్లా చెప్పవే." కత్తి తీశాడు, తళ తళ మెరసిపోతోంది. "నన్ను నమ్మ మామ, నాకేం తెలియదు, నన్ను చంపొద్దు మామ." "చెప్పు." పళ్ళు పటపట కొరికాడు, కళ్లు పెద్దవిచేశాడు. నిప్పులా ఎఱ్ఱగా వున్నాయి.

మల్లి గుండెల్లోకి నిర్దాక్షిణ్యంగా పదునైన కత్తి దూసుకుపోయింది, "మామా" అంటూ పాపారావుకు కాళ్ళమీద పడిపోయింది మల్లి, పాపారావు పాదాలు కన్నీటితో తడిశాయి. రక్తపు మడుగులో మల్లి తేలిపోతున్నది. ఎక్కడో తీతువ అరచింది.

"మల్లీ" అస్పష్టంగా వెలువడ్డాయి, యింకేవో మాటలు వెగలడానికి పెదాలు కదిలాయి, కంఠం రుద్ధమయినది. అచేతనంగా అలాగేనిలబడిపోయాడు. ప్రకృతి స్తంభించిపోయింది, కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. పాపారావు మాయ విడిపోయినది, వెర్రిగా ఆశగా మల్లి వంక చూచాడు. "మల్లి" అంటూ ఆమె మృతదేహం పైబడి యేడ్చాడు. కాని, తిరిగి మల్లివస్తుందా? 'తన మల్లి లేదు! తనెంత క్రూరంగా ప్రవర్తించాడు! తెల్లవారుతుంది. లోకం తన్నొక హంతకుణ్ణిగా గుర్తించి వెలివేస్తుంది! ఏంచెయ్యాలి?' ఆలోచనలు తిరగాడుతున్నాయి. ధైర్యంతో, పట్టుదలతోనుంచున్నాడు. శవాన్ని భుజంమీద వేసుకున్నాడు. బయటకువచ్చాడు, శూన్యంలోకి దృష్టి సారించి, నడకసాగించాడు.

ప్రకృతి నల్లగావుంది. చెట్లు దెయ్యాల్లా వున్నాయి. గాలి వీచడంలేదు. ఆకాశం మరింత నల్లగావుంది. మేము తోడున్నామంటూ నక్షత్రాలు గుంపులు గుంపులుగా వున్నాయి. తెల్లగా మెరుస్తున్నాయి. కీచురాళ్లు అరుస్తున్నాయి భయాన్ని గొల్పుతున్నాయి. మిణుగురులు మిల మిల లాడుతున్నాయి. సరుగుడులు సంగీతాన్ని వినిపిస్తున్నాయి. నక్కల అరుపులు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఎక్కడో దూరాన చితి కాలుతున్నది. తమిలో నడుస్తున్నాడు పాపారావు. కాళ్లకు ముళ్లు గుచ్చుకుంటున్నాయి. చెఱువుగట్టు దగ్గరకు వచ్చాడు. శవాన్ని నేల మీద పెట్టిముందుకు కదిలాడు. కప్పలు అరుస్తున్నాయి. ప్రకృతి భయంగా వుంది. పాపారావు తిరిగి వచ్చాడు పెద్ద రాయితో. ఉత్తరీయానికి రాయికట్టి, ఆమె నడుంకు ఉత్తరీయాన్ని కట్టాడు. శవాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. అడుగుల సవ్వడితో లోతుకు దిగి వదిలేశాడు శవాన్ని నిర్దాక్షిణ్యంగా, కఠినంగా. తానేంచేస్తున్నాడో తనకు తెలియలా, పొలంకెళ్ళి పడుకున్నాడు

తెల్లవారింది. ఏం చెయ్యాలో తెలియలేదు. మస్తుగా తాగివచ్చాడు. ఆ సాయంత్రం మల్లి వాళ్ళింటికి కబురంపాడు "మీ అమ్మాయి ఎవడితోనో లేచి పోయింది. యిక్కడ లేదని". తల్లి తండ్రులు విన్న వెంటనే కంపించిపోయారు. భోరున యేడ్చారు. పోలీసు రిపోర్టు యివ్వమని ఎవరో చెబితే యిచ్చారు.

ఒక రోజు గడచింది.

పోలీసువ్యాను పాపారావు ముందాగింది. బిత్తరపోయాడు. ఏదో తెలియని శక్తి అతన్ని ఆవరించింది.

"మల్లి భర్త నువ్వేనా?"

"అవునండి."

"ఆమె ఎందుకు వెళ్ళిపోయిందో తెలుసా?"

"ఎవర్తో వుంచుకుందండి."

"ఎలా తెలుసు?"

"... ... ..."

"ఎవరైనా చెబితే నమ్మావా?"

"... ... ..."

"మా దర్యాప్తు మేము చేస్తావుంటాము. పిలిచినప్పుడు రావాలి" అని ఇనస్పెక్టరు వ్యాను ఎక్కాడు. వ్యాను కదిలింది. పాపారావు ఆలోచనలు పరుగిడుతున్నాయి. తనమల్లి ఏ పాపమైనా చేస్తుందా? లేదు! మరెందుకు తన మల్లిని చంపాడు? చెప్పుడు మాటలు విని.

ఎవరు చెప్పారు? రంగడు! అవును రంగడు!! అప్పటికి సూర్యాస్తమయ మవుతున్నది. తెలియని ఆవేశంతో రంగడింటికి వెళ్ళాడు. లేడు. దారిలో వూరినుంచి వస్తున్న పాండు కనుపించాడు. పాపారావు పాండును చూడగానే మండిపడ్డాడు. "అరే పాండు! నా మల్లి నుంచుకున్నావు కదూ!" అంటూ పాండు మీదికెళ్ళాడు. ఈ మాటలు పాండుకు ఏమీ అర్థంకాలా!

"ఏమిటిరా పాపారావు అంటున్నావు!"

"ఏమిటా! మల్లితో నువ్వు కులకడంలేదూ?"

పాపారావు మాటలకు పాండు ఆశ్చర్యపోయాడు.

"ఎవడు చెప్పాడురా?"

"ఎవడో ఒకడు చెప్పాడు. ఆ రోజు నువ్వు రాత్రి యింటిలోనుంచి వస్తుండగా నేను చూచాను."

"ఎప్పుడు"

"ఐదు రోజుల క్రిందట."

"ఒరేయ్! పాపారావు. మల్లి నాకు చెల్లిలాంటిది. ఆమెను అవమానిస్తున్నావా? ఆ రోజు నీ కోసం యింటికి వచ్చాను. నువ్వు పొలంలోవున్నావని చెబితే అక్కడకు వెళ్ళాను. అక్కడ లేవు. తరువాత నేను వూరు వెళ్ళిపోయాను. ఛా! నువ్వు యింత అనుమానస్తుడవా?" కోపంతో అన్నాడు పాండు.

"నువ్వు చెప్పేది నిజమేనా!?"

"కాకపోతే. నిప్పులాంటి మల్లిని అనుమానించావంటే నిన్నేమనాలి?" రెట్టించాడు పాండు.

పాండు మాటలకు పాపారావు అదిరిపోయాడు. మరేమీ మాట్లాడకుండా "మల్లీ" అంటూ గబగబా పరుగెత్తుకుంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. పాండుకు ఏమీ అర్థం గాక ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు. పాపారావు అప్పరాత్రియ్యంత వరకూ తిరిగాడు. మందుతో తూలిపోతున్నాడు. కాలువ గట్టు దగ్గర కొచ్చాడు. మల్లి తన మల్లి యిప్పుడెలా వుందో చూడాలనుకున్నాడు. నీళ్ళలోకి దిగాడు. శవాన్ని బయటకు తీసుకొచ్చాడు. అబ్బా! ఆ భయంకర దృశ్యాన్ని చూస్తే వళ్లు ఝల్లు మంటుంది. శవం వాసన కొడుతున్నది. బాగా వుబ్బిపోయింది. చేపలు అవీ తిన్నాయనుకుంటా. అక్కడక్కడ శరీరభాగాలు తూట్లు పడ్డాయి. ముఖం వికృతంగా వుంది. నాసిక కొరికేసినట్లుంది. ఒక కన్ను అసలు లేదు. చెక్కిళ్ళమీద బాగా గుంటలు పడ్డాయి. తల వుబ్బిపోయి బాగా లావుగా వుంది.

"మల్లేనా? కాదు! మల్లికాదు! నా మల్లి కాదు!" వెర్రిగా కేక వేశాడు. ఆవేశంతో ముందుకు వంగి చూచాడు. ఆ శవంలో మల్లి ఆకృతి లేదు.? మల్లి అందమంతా ఏమైంది?

నక్షత్రాల వెలుగుతో శవాన్ని తీసుకుని ముందుకు నడిచాడు. ఎందుకో తనకే తెలియదు.

కొద్ది దూరంలో రెండు చితులు కాల్తున్నాయి. పసిపిల్లవాడికోసం రెండు నక్కలు పోట్లాడు కుంటున్నాయి. మరో పక్క ఏదో శవాన్ని తీసి మాంసాన్ని పీక్కుతింటున్నాయి. మరోచోట ఓ కుక్క గొయ్యి పెడుతున్నది. కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. శవాన్ని క్రింద పెట్టాడు. గొయ్యి తీశాడు. అందులో శవాన్ని పెట్టి పూడ్చాడు వళ్ళంతా చెమటలు పట్టాయి.

వెనక్కి తిరిగాడు. ముందుకు దారితీశాడు. మనిషి తూలిపోతున్నాడు. ఎక్కడున్నాడో? ఏ స్థితిలో వున్నాడో తనకు తెలియదు! రంగడింటికి దారితీశాడు. వళ్ళంతా చల్లబడింది. మైకం విడిపోయింది. ఒకసారి కళ్ళు నలుపుకున్నాడు. రంగడింటిముందాగాడు. తలుపు తట్టాడు. తెరచుకున్నాయి. రంగడు భయంగా చూచాడు పాపారావును.

"నా మల్లిని వుంచుకుం దెవడురా?" ఆవేశంలో అడిగాడు.

"............"

"పలకవే?" రౌద్రాకారంతో గర్జించాడు.

"ఎవడు లేడు"

"అ! నిజమేనా? నిజం చెప్పు." చొక్కా పట్టుకున్నాడు.

గజగజ వణకిపోతున్నాడు రంగడు. నోటి నుండి మాటలు పెగలడంలేదు.

"ఊం చెప్పు" రెండు దెబ్బలు పడ్డాయి.

"మల్లి ఏపాపం ఎరగదు. చాలా మంచిది"

"మరెందుకు అలా చెప్పావు?" ఆశ్చర్యంతో అడిగాడు.

"............"

"చెబుతావా లేదా?" చెయ్యి పైకెత్తాడు.

పాపారావు కాళ్ళమీద పడ్డాడు రంగడు. జరిగిందంతా చెప్పాడు.

"మరెప్పుడూ యిటువంటి పనులు చెయ్యను." చెంపలేసు కున్నాడు.

ఈరోజుతో ప్రాణం పోతుందనుకున్నాడు. కాని, ... ... పాపారావు రంగడిని క్షమించాడు.

"మల్లీ" అంటూ ఆవేశంగా, అత్రుతగా పరుగెత్తాడు స్మశానంకేసి.

శవాన్ని గబగబా బయటకు తీశాడు. ఒక్కసారిగా కౌగిలించుకున్నాడు. "మల్లి! నీ కన్యాయం చేశాను. నావంక ఒక సారి చూడు మల్లి యింకెప్పుడూ యిలా చెయ్యను. ఒకసారి చూడు" అంటూ ఆ కాళ రాత్రిలో శవం మీద పడి విలపిస్తున్నాడు.

'ఎవరు వింటారు అతని ఆలకింపు?'

మబ్బులు దట్టంగా అలుముకుంటున్నాయి. గాలి జోరుగా వీస్తోంది. చినుకులు ప్రారంభమైనాయి. నక్షత్రాలు ముడుచుకుంటున్నాయి. ఎక్కడి వెలుగో పాపారావుమీద వడింగి.! వెంటనే అతని చేతులకు బేడీలు తగిలించబడ్డాయి.

"నన్ను క్షమించు మల్లీ" అంటూ పాపారావు యేడ్చాడు. ఆ మాటలు గాలితో కలసి ఎక్కడికో వెళ్ళిపోయాయి. ఆకాశం నిర్మలంగా వుంది.

—:O:—